# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. టీం ఇండియా తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే అసాధ్యమైన లక్ష్యమంటూ ఏదీ ఉండదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

**2. వికసిత భారత్ సాధనకు స్థూల జాతీయోత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ వాటా కింద 2 లక్షల 40 కోట్ల రూపాయలు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు.**

**3. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి 'తెలంగాణ రైజింగ్' పేరుతో తాము చేపట్టిన కార్యక్రమాలకు సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

**4. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సుపరిపాలనపై చర్చించేందుకు ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం ఈరోజు ఢిల్లీలో జరగనుంది.**

**5. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

టీం ఇండియా తరహాలో ఒకే జట్టులా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే అసా ధ్యమైన లక్ష్యమంటూ ఏదీ ఉండదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిన్న నీతి ఆయోగ్ 10వ పాలకమండలి సమావేశాన్ని.. 2047 నాటికి వికసిత భారత్ సాధనకు వికసిత రాష్ట్రాలు అనే ఇతివృత్తంతో నిర్వహించి, పలు అంశాలపై రాష్ట్రాలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను చూడాలనేది దేశంలో 140 కోట్ల మంది పౌరుల కల అని తెలిపారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందితే దేశం వికసిస్తుందని, ప్రతి నగరాన్ని, గ్రామాన్ని అభివృద్ధి చేయడాన్ని మనం లక్ష్యంగా నిర్దేశించుకోవాలని ముఖ్యమంత్రులకు ప్రధానమంత్రి దిశానిర్దేశం చేశారు.

--------------------------

వికసిత భారత్- 2047 సాధనకు స్థూల జాతీయోత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ వాటా కింద 2 లక్షల 40 కోట్ల రూపాయలు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న జరిగిన నీతి ఆయోగ్ 10వ పాలకమండలి సమావేశంలో ఆయన 'స్వర్ణాంధ్ర- వికసిత్ భారత్ 2047'పై బ్లూ ప్రింట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధన కోసం చతుర్ముఖ వ్యూహం అనుసరించన్నామని

ప్రకటించారు. సారవంతమైన భూములు, సుదీర్ఘ తీరప్రాంతం, విస్తారమైన ఖనిజసంపద, పర్యావరణ వైవిధ్యమే ఆంధ్రప్రదేశ్ బలాలని ముఖ్యమంత్రి వెల్లడించారు.

---------------------------

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి 'తెలంగాణ రైజింగ్' పేరుతో తాము చేపట్టిన కార్యక్రమాలకు సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నిన్న ఢిల్లీలో ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వికసిత భారత్ లక్ష్యసాధనలో తెలంగాణ మొదటి వరుసలో నిలుస్తుందని తెలిపారు. మరోవైపు.. ప్రధానమంత్రి నివాసంలో ఆయనతో సమావేశమైన ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో మెట్రోరైలు మార్గం రెండో దశ నిర్మాణానికి సాయం అందించాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలకు ఒకేసారి ఆర్థిక శాఖ, మంత్రిమండలి అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై నరేంద్ర మోదీకి రేవంత్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు.

---------------------------

సినీ పరిశ్రమ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. రాజమహేంద్రవరంలో నిన్న ఆయన మాట్లాడుతూ.. చిత్ర పరిశ్రమ, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు ఉపయోగ పడేలా నిర్ణయాలు తీసుకునేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. హోంశాఖ, ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో విచారణ చేపడుతున్నామని మంత్రి దుర్గేష్ వివరిస్తూ..

..వాయిస్.. 33 సెకన్లు....

---------------------------

సుపరిపాలన అంశంపై చర్చించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం ఈ రోజు ఢిల్లీలో జరగనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో సుపరిపాలన అంశాలపై చర్చించనున్నారు. ఇందులో భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం శాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్నారు. సమావేశంలో ప్రధానంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పరిపాలనా విధానాల గురించి చర్చిస్తారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వచ్చే నెల విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్ల గురించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించారు. నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న ఆయన.. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ విషయాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. యోగా మాసం నిర్వహణ, ప్రజలకు యోగాలో శిక్షణ, సర్టిఫికెట్ల జారీ, యోగా దినోత్సవంలో రైతులు, మహిళలు, విద్యార్థులు, సామాన్యులు, ప్రముఖులను భాగస్వామ్యం చేసేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. సుమారు 5 లక్షల మందితో రికార్డు స్థాయిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతోందని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతిలో నిన్న ఆయన యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. నూతన పరిశ్రమలకు భూమి కేటాయిస్తూ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈ కింద ప్రతి నియోజకవర్గానికి పార్క్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి శ్రీనివాస్ వివరిస్తూ...

..వాయిస్... 31 సెకన్లు

---------------------------

ఈ రోజు ప్రపంచ థైరాయిడ్ నివారణ దినం నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి సంబంధిత సమస్యలపై అవగాహన లేని కారణంగా అనేకమంది ఆరోగ్యసమస్యలకు గురౌతూఉంటారు. థైరాయిడ్ సమస్యలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రతిసంవత్సరం మే 25వ తేదీ ప్రపంచ థైరాయిడ్ నివారణా దినంగా పాటిస్తున్నారు. థైరాయిడ్ గ్రంధి నిర్ణీతమోతాదుకంటే తక్కువగా హార్మోన్ విడుదలచేస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీన్నే హైపోథైరాయిడిజమ్‌గా వ్యవహరిస్తారు.

---------------------------

ఉత్తర ఒడిశా సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఈ నెల 27వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. వీటి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం సూచించింది. అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ జిల్లాల్లో ఈ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ నెల 28వ తేదీ వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

---------------------------

కొవిడ్ వ్యాప్తిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కరోనాపై కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి రాష్ట్రాలకు ఇప్పటివరకూ సూచనలు, మార్గదర్శకాలు రాలేదని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొవిడ్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిన్న ఆయన ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నమోదయ్యే కొవిడ్ కేసులను ఎదుర్కోవడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కొవిడ్, డెంగీ పేరిట ప్రజలను ఆందోళనకు గురిచేసే ఆసుపత్రులు, వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఐదు రక్షణ కారిడార్లను గుర్తించామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' విజయంలో వీర సైనికులు, స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన రక్షణ పరికరాలు దేశానికి గర్వకారణంగా నిలిచాయని 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్వదేశీ రక్షణ ఉత్పత్తుల్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు.

====================